సాక్షి పెద్దపల్లి

ఆదివారం । 1 । జనవరి । 2023











2022.. చూస్తుండగానే గడిచిపోయింది. కొత్త ఏడాది 2023 రానే వచ్చింది. ఆంగ్ల సంవత్సరాదిని ఆహ్వానిస్తూ.. జిల్లావ్యాప్తంగా వేడుకలు అంబరాన్నంటాయి. శనివారం అర్ధరాత్రి 12గంటలు కాగానే.. యువత పెద్ద ఎత్తున రోడ్లపైకి చేరుకుని కేరింతలు కొడుతూ.. సంబరాలు జరుపుకున్నారు. నయా సంవత్సరాన్ని సాదరంగా ఆహ్వానించారు.

సరి కొత్తగా సాగుతాం..!

- కోటి ఆశలతో 2023లోకి అడుగు
- ప్రజలకు పరిపాలన చేరువే లక్ష్యం
- జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల మనోగతం

సాక్షి, పెద్దపల్లి: కాలగర్భంలో మరో ఏడాది కలిసిపోయింది. మళ్లీ కొత్త సంవత్సరం రానే వచ్చింది. ఎన్నో కలలు.. మరెన్నో లక్ష్యాలు సాధించాలన్న తలంపుతో జిల్లావాసులు కోటి ఆశలతో నూతన సంవత్సరంలోకి అడుగుపెట్టారు. 2022 మిగిల్చిన చేదు అనుభవాలను పక్కనపడేసి.. నూతన వసంతాన్ని ఆహ్వానించారు. మరోవైపు జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు ఈఏడాది మొత్తం ప్రజలందరికీ శుభాలు కలగాలని ఆకాంక్షించారు. తాము చేపట్టే పనులు, తీసుకున్న నిర్ణయాలు, లక్ష్యాలను 'సాక్షి'తో పంచుకున్నారు. ఆ విశేషాలు..

అందరికీ అభివృద్ధి ఫలాలు



అభివృద్ధి ఫలాలు జిల్లా ప్రజలందరికీ అందేలా కృషిచేస్తా. తుది దశలో ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్లు పూర్తి చేసి ప్రభుత్వ ఆదేశాల మేరకు పంపిణీ చేపడతాం. ప్రాజెక్టులకు భూసేకరణ చేసి పనులు వేగవంతమయ్యేలా అధిక ప్రాధాన్యత ఇస్తాం. శుభాకాంక్షలు తెలిపేందుకు పుష్పగుచ్ఛాల బదులు శానిటైజర్లు, మాస్కులు, పీపీఈ కిట్లు, నోట్‌బుక్కులు అందించాలి. – సంగీత, కలెక్టర్

ప్రజల భద్రతకు పెద్దపీట



రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాల నివారణకు చర్యలు చేపట్టనున్నాం. మహిళలు, పిల్లలపై దాడుల అరికడతాం. సీసీ కెమెరాలు నేరాల విచారణకు ఉపయోగపడుతాయి. ఆపరేషన్ ధృవ పేరుతో ఇప్పటికే ఇటుక బట్టీల్లో పాఠశాలలు ప్రారంభించాం. లారీ, ఆటో, బస్సు డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తాం. – రూపేష్, డీసీపీ పెద్దపల్లి

మంచి ర్యాంకు వచ్చేలా..



రామగుండంలో రూ.23 కోట్ల పట్టణ ప్రగతి నిధులతో టెండర్లు పిలిచాం. మరో రూ.2 కోట్ల ఎన్టీపీసీ సీఎస్ఆర్ నిధులతో పనులు చేపడుతాం. రూ.4.50 కోట్లతో కొత్త పైప్‌లు వేయిస్తాం. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో కార్పొరేషన్ మంచి ర్యాంక్ సాధించేలా ముందుకెళ్తాం. – సుమన్‌రావు, కమిషనర్, రామగుండం

నియోజకవర్గ అభివృద్ధికి కృషి



కొత్త సంవత్సరంలో నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలి. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాను. ఇందులో భాగంగా సబంధిత శాఖల మంత్రులను పలుమార్లు కలిసి విన్నవించాను. ఇప్పటికే నియోజకవర్గవ్యాప్తంగా అనేక అభివృద్ధి పనులు చేపట్టాం. ఎస్సారెస్పీ కాలువ ద్వారా గోదావరి జలాలు సమృద్ధిగా వస్తున్నాయి. ప్రజలు నిర్భయంగా యాసంగి పంటలు సాగు చేసుకోవచ్చు. సంక్షేమ పథకాలు ప్రజలందరికీ అందేలా చూస్తా. రాష్ట్రప్రభుత్వం వరుస నోటిఫికేషన్లు విడుదల చేస్తున్న నేపథ్యంలో నిరుద్యోగుల కోసం కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేసి, నియోజకవర్గం నుంచి ఎక్కువ మంది ఉద్యోగం సాధించేలా చూస్తా. – దాసరి మనోహర్‌రెడ్డి, పెద్దపల్లి ఎమ్మెల్యే

అభివృద్ధి పనులు వేగవంతం



నియోజకవర్గంలతో అభివృద్ధి కార్యక్రమాలు ఊపందుకుని ప్రజలందరికీ మేలు జరగాలి. జిల్లా అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకుని సహకారం అందిస్తాం. రామగుండం నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ.. వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తా. కార్పొరేషన్ స్వచ్ఛ పర్యవేక్షణ్‌లో ముందంజలో ఉండేలా ప్రజల సహకారం, అధికారులతో సమన్వయం చేసుకుని ముందుకు సాగుతాం. సింగరేణి కార్మికుల తరఫున వారి సమస్యల పరిష్కారానికి వివిధ స్థాయిల్లో పాటుపడుతా. జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు.

– కోరుకంటి చందర్, రామగుండం ఎమ్మెల్యే

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్

పెద్దపల్లిరూరల్: లింగ నిర్ధారణ పరీక్షలు చేసినా.. చేయించుకున్నా.. ప్రోత్సహించినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రమోద్‌కుమార్ అన్నారు. తన కార్యాలయంలో గర్భస్థ పూర్వ, గర్భస్థ లింగనిర్ధారణ అడ్వయిజరీ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో జరిగే ప్రసవాల్లో ప్రతి వెయ్యి మంది మగపిల్లలకు 948 మంది ఆడపిల్లలు జన్మిస్తున్నారని, ఆడపిల్లలను ప్రోత్సహించేలా కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. లింగ నిర్ధారణ పరీక్షలను నియంత్రించేందుకు ప్రతినెలా స్కానింగ్ సెంటర్లను వైద్యశాఖ బృందాలు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహిస్తున్నాయని వెల్లడించారు. సమావేశంలో డీసీఏహెచ్‌ఎస్ శ్రీధర్, సూపరింటెంటెండ్ శౌరయ్య, గైనకాలజిస్టు ప్రియాంక, జిల్లా కన్వీనర్ కావేటి రాజ్‌గోపాల్ తదితరులున్నారు.


బొగ్గు బ్లాకుల విక్రయాలు నిలిపేదాకా పోరాటం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని: సింగరేణి బొగ్గు బ్లాకుల విక్రయాలు నిలిపేసేదాకా పోరాడుతామని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. శనివారం ఆర్జీ–2 ఏరియా ఓసీపీ–3 బేస్ వర్క్‌షాప్‌లో గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. రాష్ట్ర ఆవిర్భావం అనంతరం సీఎం కేసీఆర్ సింగరేణి కార్మికులకు కొత్త హక్కుల సాధించిపెట్టారన్నారు. ప్రధాని మోదీ మాత్రం బొగ్గు బ్లాకులను విక్రయానికి పెడుతున్నారని పేర్కొన్నారు. ఎవరెన్ని విమర్శలు చేసినా కార్మికులకు న్యాయం జరిగేవరకూ పోరాడుతానని స్పష్టం చేశారు. టీబీజీకేఎస్ అధ్యక్షుడు వెంకట్రావు, మేయర్ అనిల్‌కుమార్, స్త్రీశిశు సంక్షేమ శాఖ నాయకురాలు మూల విజయారెడ్డి, నాయకులు ఐలి శ్రీనివాస్, కొత్త సత్యనారాయణరెడ్డి, బదావత్ శంకర్‌నాయక్, సత్యం, బానాకర్, ఆవునూరి రాజేశం పాల్గొన్నారు.

అంతర్జాతీయ క్రీడా పోటీల్లో గురుకులం విద్యార్థులు



విజేతలుగా నిలిచిన రామగుండం మైనార్టీ విద్యార్థులు

రామగుండం: అండర్–14 అంతర్జాతీయ క్రీడాపోటీల్లో రామగుండం మైనార్టీ విద్యాలయం విద్యార్థులు పలు ఈవెంట్లలో విజేతలుగా నిలిచారు. వారం రోజులుగా నేపాల్‌లోని పోఖ్రా స్టేడియంలో జరిగిన పోటీలు ముగిశాయి. క్రికెట్ పోటీల్లో ఎండీ.తౌఫిక్ బెస్ట్ బౌలర్‌గా నిలిచాడు. ఖోఖోలో సింధూనాయక్, నవీన్, రాజ్‌కుమార్, కబడ్డీలో సాయిగణేష్ ప్రతిభ కనబరిచారు. వీరిని ప్రిన్సిపాల్ ప్రశాంత్‌కుమార్, పీఈటీ వినోద్‌కుమార్, కాంగ్రెస్, బీజేపీ ప్రతినిధులు అభినందించారు.

ఎన్టీపీసీలో 1,162 మి.యూ. విద్యుత్ ఉత్పత్తి

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు డిసెంబర్‌లో 71.0 ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్ (పీఎల్ఎఫ్)తో 1,162 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేసినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. 2022–23లో ఎనిమిది మాసాల్లో 85.0 శాతం పీఎల్ఎఫ్‌తో 11,521 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి సాధించింది. 2600 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో వార్షిక లక్ష్యం 16,271 మిలియన్ యూనిట్లుగా నిర్దేశించారు. యూనిట్–2, యూనిట్–5లో వార్షిక మరమ్మతులు కొనసాగుతున్నాయి.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలు



గాయపడిన మల్లయ్య

రామగిరి(మంథని): రామగిరి మండలం కల్వచర్ల బస్టాండ్ సమీపంలో పెద్దపల్లి– మంథని ప్రధాన రహదారిపై శనివారం వేకువజామున రోడ్డు ప్రమాదం జరిగింది. గ్రామానికి చెందిన బండ మల్లయ్యకు తీవ్రగాయాలు అయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. రోడ్డుపై ఎదురెదురుగా డీసీఎంవ్యాను, లారీ ఢీకొన్నాయి. రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తున్న మల్లయ్యను లారీబలంగా ఢీకొట్టడంతో రహదారిపై పడిపోయాడు. తలకు తీవ్రగాయాలు అయ్యాయి. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం మల్లయ్యను పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. రోడ్డుపై డీసీఎం వ్యాన్ బోల్తా పడటంతో అందులోని సుమారు 200 కోళ్లు చనిపోయాయి. కాగా ఈ ఘటనకు కారణమైన లారీ దొరకలేదు.

రక్షణ పరికరాలు అందజేత



కార్మికులకు రక్షణ పరికరాలు అందిస్తున్న వెంకన్న

రామగిరి(మంథని): సింగరేణి సంస్థ ఆర్జీ–3 పరిధి ఓసీపీ–1 టెక్నికల్ వర్క్‌షాప్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు శనివారం రక్షణ పరికరాలైన షూస్, హెల్మెట్, రేడియం జాకెట్లను కాంట్రాక్టర్ గొర్రె సతీశ్ అందించారు. ఈ సందర్భంగా సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకన్న మాట్లాడుతూ పనిస్థలాలలో కార్మికులు తప్పకుండా రక్షణ చర్యలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ కార్మికులు కుమార్, భూమయ్య, సందీప్ పాల్గొన్నారు.

ఆధార్ లింకు అయితేనే ఉపాధి కూలీ



- హాజరు నమోదు కూడా ఆన్‌లైన్‌లోనే
- అవకతవకలు, ఇబ్బందులను దూరం చేసేందుకే
- నేటి నుంచి అమలు
- జిల్లాలో 2,62,936 మంది కూలీలు

పెద్దపల్లిరూరల్: ఊళ్లలో పనిలేని నిరుపేద కుటుంబాలకు ఉపాధి నిచ్చేందుకు కేంద్రం అమల్లోకి తెచ్చిన ఉపాధిహామీ పథకాన్ని కొత్త ఏడాది నుంచి పకడ్బందీగా అమలు చేసేందుకు చర్యలు చేపట్టింది. ఇందుకోసం మార్గదర్శకాలను క్రమంగా అమలు చేస్తూ వస్తోంది. ఉపాధి పనులకు వచ్చే కూలీల హాజరును గతంలో మాదిరిగా కాకుండా ఆన్‌లైన్‌లోనే చేయాలని ఆదేశాలిచ్చింది. పని చేసిన కూలీలకు చెల్లింపుల్లోనూ ఇబ్బందులు రాకుండా ఉండేందుకు ఖచ్చితంగా ఉపాధి పోర్టల్ నమోదు అయిన వారి ఆధార్‌కార్డును అనుసంధానం చేయాలని పేర్కొంది.

ఆధార్‌తో అనుసంధానం

ఉపాధిహామీ పనులు చేసేందుకు పేర్లు నమోదు చేసుకున్న కూలీలు తమ ఆధార్‌కార్డును అనుసంధానం చేసుకోవాల్సిందే. జిల్లాలో 262936మంది కూలీలున్నారు. వీరిలో 19,5031 మంది గతంలోనే ఆధార్ లింకు చేసినా...కొత్త సాఫ్ట్‌వేర్ అమల్లోకి రావడంతో 17,8291మంది చేసుకున్న ఆధార్‌లింకు కనిపించకుండా పోయింది. జనవరి కల్లా అందరి ఆధార్‌కార్డును అనుసంధానించేలా ఈజీఎస్ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ అనుసంధాన ప్రక్రియ పూర్తయితే ఆ పేరుతో ఉన్న ఉపాధి కూలీకి ఏ బ్యాంకులో ఖాతా ఉన్నా కూలీ సొమ్ము వెంటనే జమ అవుతుందని ఓ అధికారి తెలిపారు. గతంలో ఉపాధి కూలీ ఇచ్చిన బ్యాంకు ఖాతాకే జమయ్యేదని, ఆ. ఖాతాకు ఏదేని కారణంగా సమస్య తలెత్తితే కూలీకి చెందిన మరో బ్యాంకులో ఆధార్‌నెంబరుతో లింకు అయిఉన్న ఖాతాలో జమ అవుతాయని అధికారవర్గాలు పేర్కొన్నాయి.

ఆన్‌లైన్‌లోనే 'ఉపాధి' హాజరు

ఉపాధి పనులు చేసే కూలీల హాజరు నమోదు గతంలో మేట్ల ద్వారా జరగ్గా, గతేడాది మే నుంచి ఆన్‌లైన్‌లో చేసే ప్రక్రియ మొదలైంది. ఇప్పటి వరకు ఎలాగోలా నమోదు జరిగినా.. కొత్త ఏడాది (2023 జనవరి) నుంచిమాత్రం పూర్తిగా ఆన్‌లైన్‌లోనే నమోదు ప్రక్రియ జరపాలని ఆదేశాలందాయి. కూలీలు పనిచేసే ఫొటోలను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఈ విధానం ద్వారా అవకతవకలకు చెక్ పడనుంది. ఇదివరకటిలా ప్రతి 20మందిని శ్రమశక్తి సంఘంగా కాకుండా ఇక నుంచి 20మంది ఓ మస్టర్ లెక్కన ఆన్‌లైన్ హాజరు నమోదు తో ఉపాధి పనులు జరగనున్నాయి.

వివరాలివీ

జిల్లాలో 2,62,936 మంది ఉపాధి కూలీలుండగా ఇప్పటివరకు 1,95,031 మంది కూలీల ఆధార్ కార్డు అనుసంధానం చేశారు. మరో 67,905 కార్డులు కావాల్సి ఉంది. ఇందులో అత్యధికంగా మంథని మండలంలో 8471 ఆధార్ కార్డులు అనుసంధానం చేయాల్సి ఉంది. అత్యల్పంగా ఎలిగేడు మండలంలో 2211 కార్డులు కావాల్సి ఉంది. ఇప్పటివరకు 16187మంది కూలీల కార్డులు పూర్తిస్థాయిలో అనుసంధానమైనట్లు అధికారవర్గాలు పేర్కొన్నాయి.

అంతా ఆన్‌లైన్‌లోనే

ఉపాధి పనులు పారదర్శకంగా జరిపేందుకు ఇక నుంచి ఆన్‌లైన్‌లో ప్రక్రియ జరపాలని నిర్ణయించారు. పనులు చేసే కూలీల వివరాలను ఫొటోతో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. అలాగే ప్రతి కూలీ ఆధార్‌కార్డును అనుసంధానం చేస్తేనే ఎలాంటి జాప్యం లేకుండా నేరుగా ఖాతాకు కూలీ సొమ్ము జమవుతుంది.

– శ్రీధర్, డీఆర్‌డీవో, పెద్దపల్లి

ఆర్‌ఎఫ్‌సీఎల్ యాజమాన్యం మొండి వైఖరి వీడాలి



కార్మికులకు పార్టీ కండువా కప్పుతున్న యాకయ్య

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం ఫెర్టిలైజర్స్ కెమికల్ లిమిటెడ్ కర్మాగారంలో అమోనియా ప్లాంట్‌లో శానిటరీ విభాగంలో పనిచేస్తున్న కార్మికులతో ప్లాంట్లో ఇతర పనులు చేయాలని ఆర్‌ఎఫ్‌సీఎల్ అధికారులు ఒత్తిడి చేస్తున్నారని ఆర్‌ఎఫ్‌సీఎల్ సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వేల్పుల కుమారస్వామి అన్నారు. శనివారం ఆర్‌ఎఫ్‌సీఎల్ అమరవీరుల స్తూపం వద్ద ఏర్పాటుచేసిన సమావేశంలో ఆర్‌ఎఫ్‌సీఎల్ సీఐటీయూ అధ్యక్షుడు యాకయ్య నూతనంగా కార్మిక సంఘంలో చేరిన కార్మికులకు కండువా కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. యాకయ్య మాట్లాడుతూ కర్మాగారంలో పనిచేసే కాంట్రాక్టు కార్మికులకు సమాన పనికి సమాన వేతనం కార్మిక అందించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులకు బోనస్, సెలవులు, జీతం చిట్టీలు, ఓటీ, ఇతర అలవెన్సులు అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డి శ్రీనివాస్, లచ్చయ్య, శ్రావణ్ కుమార్, బహదూర్ సింగ్, తిరుపతిరెడ్డి, రాజయ్య, రాజేశం, వెంకటేష్, పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో సీఐల బదిలీలు

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో పలువురు సీఐల బదిలీ అయ్యాయి. కరీంనగర్ సీసీఎస్‌లో అటాచ్‌గా ఉన్న సంద లింగమూర్తిని అదే స్థానంలో రెగ్యులర్ సీఐగా, అచ్చ కిరణ్‌కుమార్‌ను చందుర్తి సీఐగా, పి.మధుకర్‌ను సిరిసిల్ల పీసీఆర్‌కు, బొల్లం రమేశ్‌ను రామగుండం కమిషనరేట్ నుంచి హుజూరాబాద్ టౌన్ సీఐగా, హుజూరాబాద్ సీఐగా ఉన్న వి.శ్రీనివాస్‌ను రామగుండం కమిషనరేట్‌లోని ఎస్‌బీకి బదిలీలు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

సింగరేణి వార్తలు

ఏపీఏలో 101శాతం బొగ్గు ఉత్పత్తి



వివరాలు వెల్లడిస్తున్న జీఎం వెంకటేశ్వరరావు

రామగిరి(మంథని): సింగరేణి సంస్థ పరిధిలోని ఏపీఏలో డిసెంబర్ నెలలో 101శాతం, ఆర్జీ–3లో 78శాతం బొగ్గు ఉత్పత్తి జరిగినట్లు జీఎం వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం జీఎం కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. ఆర్జీ–3 ఏరియాలో 6.8 లక్షల టన్నులకు గానూ 4.83 లక్షల టన్నులు ఉత్పత్తి చేసి 78శాతం సాధించినట్లు తెలిపారు. ఏఎల్పీలో 1.83 లక్షల టన్నులకు గాను 1.84 టన్నులు ఉత్పత్తి చేసి 101శాతం సాధించినట్లు వివరించారు. 2023లో ప్రమాదరహితంగా ఉత్పత్తి సాధించాలని సూచించారు. ఏపీఏ జీఎం ఎన్.వీ.కే. శ్రీనివాస్ ఉన్నారు.

మెరుగైన వేతనం కోసం పోరాడాలి



మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి బొగ్గు గని కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందం కోసం పోరాటం చేయాలని తెలంగాణ గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐ.కృష్ణ అన్నారు. శనివారం యైటింక్లయిన్‌కాలనీ ప్రెస్‌భవన్‌లో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. జనవరి 3న జేబీసీసీఎల్ సమావేశాల్లో వేతన ఒప్పందం జరగకపోతే కోల్ ఇండియా స్థాయిలో సమ్మెకు పిలుపునివ్వాలని కోరారు. నాయకులు నరేశ్, అశోక్, కొమురయ్య, బాబు, యూసుఫ్, సాంబయ్య, వేణు, కాంతయ్య, రవి, రాంబాబు, సంతోశ్ ఉన్నారు.

వార్షిక లక్ష్యసాధనలో మరింత ఉత్తేజం నింపాలి

గోదావరిఖని: వార్షిక లక్ష్యసాధనలో నూతనోత్తేజాన్ని నింపాలని ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్ కోరారు. శనివారం ఏరియా ఉద్యోగులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగులు సమష్టి కృషితో ఏరియా గడిచిన తొమ్మిది నెలల్లో 101శాతంతో నిలిచిందన్నారు. రాబోయే మూడునెలల్లో ఇదే స్ఫూర్తితో ముందుకు సాగి రక్షణతో కూడిన నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి సాధించాలన్నారు. వార్షిక లక్ష్యసాధనలో ఏలాంటి ఇబ్బందులు లేకుండా ముందుకు సాగాలని కోరారు.

అక్రమాల వారధిగా పార్వతీ బ్యారేజీ?

- ప్రజా రవాణా కన్నా అసాంఘిక కార్యకలాపాలే అధికం
- కట్టడికి కరువైన సమన్వయం
- సరిహద్దు దాటుతున్న బియ్యం, గుట్కా, ఇసుక, కలప
- అధికారులు తీరుపై అసహనం



మంథని మండలం సిరిపురం సమీపంలోని పార్వతీ బ్యారేజీ

మంథని: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో ప్రజల సౌకర్యార్థం బ్యారేజీ తో పాటు వంతెన ఏర్పాటు చేశారు. దూరం తగ్గుతుందని భావిస్తే ఇప్పుడివీ అసాంఘిక కార్యకలాపాలకు రాచమార్గాలయ్యాయి. జిల్లాతో పాటు మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలను కలిపే ఈ వంతెనపై నిఘానేత్రాలు లేకపోవడంతో ఈ రహదారులు అక్రమార్కులకు ఓ వరంగా మారాయి.

అక్రమమే అధికం

జిల్లాలోని మంథని నుంచి ఉమ్మడి అదిలాబాద్ జిల్లా సరిహద్దులకు వెళ్లాలంటే కేవలం గోదావరిఖని వద్ద ఉన్న వంతెనే ఆధారం. ఈ వంతెన మీదుగానే రాకపోకలు జరిగేవి. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మంథని మండలం సిరిపురం వద్ద గోదావరినదిపై పార్వతీ బ్యారేజీ వంతెన, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం దామెరకుంట సమీపంలోని అన్నారం వద్ద ఆనకట్టలు నిర్మించారు. రెండు వారధులు నిర్మాణం పూర్తయిన నాటి నుంచే రాకపోకలకు అనుమతులు ఇచ్చారు. దీంతో మంచిర్యాల జిల్లా సరిహద్దు ఆవల వైపు వెళ్లేందుకు మార్గం సుగమమైంది. ఈ బ్యారేజీ వంతెన నుంచి జయశంకర్ భూపాలపల్లి జిల్లా పరిధిలో కాటారం మండలం దామెరకుంట, గుండ్రాత్‌పల్లి సమీపంలో అన్నారం వంతెన నిర్మించారు. వంతెన దాటితే మంచిర్యాల జిల్లా చెన్నూర్ నియోజకవర్గం పరిధిలోని సుందరశాలకు చేరుతుంది. అక్కడి నుంచి సులువుగా మంచిర్యాల, మహారాష్ట్ర, చత్తీష్‌గడ్ రాష్ట్రాలకు వెళ్లవచ్చు. అలాగే జిల్లాలోని పార్వతీ బ్యారేజీకి అవతలి వైపు మంచిర్యాల జిల్లా కిష్టాపూర్, జైపూర్, చెన్నూర్, మంచిర్యాల మీదుగా మహారాష్ట్ర వైపు సులభంగా వెళ్లేందుకు వీలవుతుంది. రెండు వారధుల ద్వారా మూడు జిల్లాలతో పాటు రెండు రాష్ట్రాలకు రవాణా దగ్గరైంది. ఐతే పూర్తి స్థాయిలో రోడ్లు లేకపోవడంతో ప్రజా రవాణాకు కొంత అసౌర్యంగానే ఉంది. కాని అక్రమార్కులు మాత్రం సులువుగా రాష్ట్రాల సరిహద్దులు దాటేందుకు ఈ రహదారులను ఎంచుకుంటున్నారు.

అనేక నేరాలకు అడ్డదారులు

రేషన్ దుకాణాల ద్వారా సేకరించిన సబ్సిడీ బియ్యంతో పాటు గుట్కా,పొగాకు ఉత్పత్తులు, కలప,గంజాయి లాంటివి అక్రమ రవాణా చేస్తున్నట్లు సమాచారం. ఈ మార్గాల ద్వారానే అనేక మంది నిందితులు సైతం తప్పించుకున్న ఆధారాలు పోలీసులకు లభ్యమైనట్లు సమాచారం. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన హైకోర్టు న్యాయవాద దంపతులను హత్యచేసిన అనంతరం నిందితులు హత్యకు వినియోగించిన కత్తులను ఈ బ్యారేజీలోనే పడవేసి ఈ దారి గుండానే మహారాష్ట్రకు పారిపోయారు. అదే సంవత్సరం మంథని మండలం గుంజపడుగు బ్యాంకులో భారీ చోరీకి పాల్పడ్డ వారు కూడా ఇదే పార్వతీ వంతెన నుంచి పారిపోయినట్లు పోలీసులు అనుమానిరచారు. నీటిపారుదలశాఖ, సివిల్ సప్లై, పోలీసులు ఇలా.. సంబంధింత శాఖల్లో లోపించిన సమన్వయంతో అక్రమ దందాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. బ్యారేజీలకు రెండు వైపులా ఆయా జిల్లాల పోలీసులు, అటవీశాఖ అధికారులు జాయింట్ చెక్‌పోస్టుల ఏర్పాటుకు అవకాశం ఉందనే అభిప్రాయం ప్రజల నుంచి వ్యక్తమవుతోంది.

నిరంతర నిఘా

మంథని మండలం సిరిపురం సమీపంలోని బ్యారేజీ,వంతన మీదుగా ఏదైన అక్రమ రవాణా జరుగుతున్న సమాచారం అందింతే సిరిపురం సమీపంలో తనిఖీలు నిర్వహిస్తున్నాం. అంతేగాకుండా బ్యారేజీ...వంతెనపై నిరంతర నిఘా ఉంటుంది.

– సతీశ్, సీఐ, మంథని

కలెక్టర్‌కు జీఎం శుభాకాంక్షలు



గోదావరిఖని: కలెక్టర్ సంగీతను ఆర్జీ–1 జీఎం కె.నారాయణ శనివారం కలిశారు. శాలువా, మొక్క అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరంలో సంస్థ అభివృద్ధిలో సహాయ,సహకారాలు అందించాలని కోరారు. అలాగే అడిషనల్ కలెక్టర్ లక్ష్మినారాయణకు పుష్పగుచ్ఛం అందించారు.